క్లుప్తంగా

విద్యార్థినికి నగదు బహుమతి



మైమూన్‌కు బహుమతి అందజేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి, తదితరులు

కొత్తపట్నం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన విద్యార్థిని షేక్ మైమూన్‌కు ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో బుధవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మైమూన్ 580 మార్కులు సాధించడంతో డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి అభినందించి జ్ఞాపిక, రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి షేక్ శ్రీనివాస రావు, అల్లూరు గ్రామ పెద్ద తిరుమలశెట్టి శ్రీనివాస్, డాక్టర్లు సానల ధీరజ్‌బాబు, నాగిడి కుమార్‌వర్మ, నందలూరి సరయు, పాక్కింగారి ఏడుకొండలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అమ్మవారు

మోటుమాల (కొత్తపట్నం): మోటుమాల గ్రామంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న పద్మాల అంకమ్మతల్లి కొలుపుల మహోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం అంకమ్మతల్లికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి గజాల కొలువు, బొమ్మలాట నిర్వహించారు. అంకమ్మతల్లి గ్రామోత్సవం పోతులూరి వీరబ్రహ్మంగుడి, రాములవారి గుడి, కోళ్లఫారం, బస్టాండ్ సెంటర్ మీదుగా సాగింది. అమ్మవారికి నీటి బిందెలతో పూజలు చేసి టెంకాయలు కొట్టి హారతిచ్చారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



వలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందిస్తూ, ప్రతి నెలా ఒకటో తేదీ అవ్వాతాతలకు పెన్షన్లు పంపిణీ చేస్తూ ప్రభుత్వానికి–ప్రజలకు వారధులుగా నిలుస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని మల్లవరం సమీపంలో గల విజయభవన్‌లో బుధవారం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరికీ వివరిస్తూ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే చంద్రబాబు జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. వారు సిఫార్సు చేసిన వారికే పథకాలు వర్తింపజేశారని గుర్తుచేశారు. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి 50 గడపలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతుంటే నెలలో మొదటిరోజే వలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారని ప్రతి అవ్వాతాత ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పది మందికి సహాయపడే అవకాశాన్ని ముఖ్యమంత్రి మనకు కల్పించారని, ఇది ఎంతో అదృష్టమని అన్నారు. చక్కగా పనిచేస్తున్న వలంటీర్లకు వారి ప్రతిభ ఆధారంగా ప్రతి సంవత్సరం సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులు అందిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది మద్దిపాడు మండలానికి రెండు సేవావజ్ర అవార్డులు రావడం అదృష్టమని ఆయన అన్నారు. వారిని సన్మానించేందుకు వైఎస్సార్ సీపీ మండల నాయకులు కూడా హాజరవడం హర్షనీయమన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రతినిధులుగా పనిచేసి ప్రభుత్వం చేసే ప్రతి మేలును వారి క్లస్టర్‌లోని 50 గృహాలకు తెలియజేయాలని కోరారు. వలంటీర్లకు అండగా గృహ సారథులను ఏర్పాటు చేశామని, అందువలన ఇంకా వేగంగా ప్రతి ఇంటిలో లబ్ధిదారులతో మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ మంది నుంచి ప్రభుత్వానికి మద్దతు లభించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే టీజేఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, పిట్టల ఆంజనేయులు, తిప్పారెడ్డి కోటిరెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా విభాగం అధ్యక్షుడు నర్రా సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, కుమ్మూరి సుధాకర్, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ నారా విజయలక్ష్మి, నారా సుబ్బారెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామకపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే...

మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు మండలాల్లో ఇటీవల ఇంటర్వ్యూల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలుగా ఎంపికైన వారికి సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చేతుల మీదుగా బుధవారం నియామకపత్రాలు అందజేశారు. వారంతా ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలుపుతూ పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గుండ్లాపల్లి ఎంపీటీసీ పద్మకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు నర్రా సురేష్, మందా చిన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం



మల్లవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ నాయకులు

- అందుకోసమే మన ఊరు – మన ఎమ్మెల్యే కార్యక్రమం
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: గ్రామాల్లోని సమస్యలన్నీ పరిష్కరించేందుకే మన ఊరు – మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. జగనన్న కుటుంబ సమావేశాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లవరం సమీపంలో గల విజయభవన్‌లో బుధవారం మన ఊరు – మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకుని వాటి పరిష్కారానికి ప్రయత్నించే క్రమంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. మల్లవరం గ్రామంలోని సమస్యలను తెలియజేయాలని పార్టీ నాయకులు, గ్రామస్తులు, సర్పంచ్‌ని కోరారు. గ్రామంలో ఉమ్మడిగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకి నాయకులు వివరించారు. చెంచిరెడ్డి కుంటలోకి ఎస్కేప్ చానల్ ద్వారా వెళ్లే నీటికి అడ్డుకట్ట వేయడంతో సుమారు 90కిపైగా ఎకరాల్లో నీరు నిలిచిపోయి పంట ఉరకెత్తిపోతోందని, ప్రతి సంవత్సరం అదే సమస్య ఉంటుందని తెలిపారు. అంబేడ్కర్ బొమ్మ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత తక్కువ ఎత్తులో ఉందని, దాని వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మల్లవరం గ్రామాన్ని నిర్లక్ష్యం చేయడం, గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు చేయడం గురించి గ్రామస్తులకు వివరించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో మల్లవరానికి కేవలం రూ.4 కోట్ల నిధులు మాత్రమే కేటాయించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించగా, వైఎస్సార్ సీపీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న ఈ నాలుగేళ్లలో రూ.26.85 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. సచివాలయంలో అందిస్తున్న సేవలపై ఉద్యోగులతో మాట్లాడారు. ప్రభుత్వ పనితీరుపై వారంతా సంతృప్తి వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రజలందరూ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నిరసన...

ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మల్లవరం సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు. రాష్ట్ర రాజధానిలో 50 వేల మంది పేదలకు అందించే ఇళ్ల స్థలాలు శవాలను పూడ్చేందుకు చాలవంటూ చంద్రబాబు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నిర్వహించిన నిరసన ర్యాలీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, మేకల కృష్ణారెడ్డి, మండవ బాల చంద్రమౌళి, పోతినేని శ్రీనివాసరావు, సన్నపురెడ్డి రమణమ్మ, విల్సన్, జేసీఎస్ కన్వీనర్లు బత్తుల శ్రీనివాసరావు, కుమ్మూరి సుధాకర్, మద్దా లక్ష్మీనారాయణ, నారా విజయలక్ష్మి, పద్మకుమారి, విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, పలువురు నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం ప్రారంభం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు: వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో వ్యక్తులను నిమగ్నం చేసేందుకు పర్యావరణ జీవనశైలి మిషన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టారని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. దాని లక్ష్యాలను సమాజంలో ప్రతిఒక్కరికీ తెలియజేసి అవగాహన పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. స్థానిక రంగారాయుడు చెరువుపై మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించి మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ చేంజ్ కాన్ఫరెన్స్‌లో ఒక నిర్దిష్ట లక్ష్యంతో పర్యావరణాన్ని కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, ప్రస్తుతం సాధారణ మానవుని జీవనశైలిలో రావాల్సిన మార్పులకు సంబంధించి ఒక అంగీకారం జరిగిందన్నారు. తద్వారా భూమికి హాని కలిగించని జీవితాన్ని గడిపేందుకు ప్రతిఒక్కరిపై వ్యక్తిగత, సామూహిక కర్తవ్యం ఉంటుందన్నారు. ఇలాంటి జీవనశైలిని అభ్యసించేవారిని లైఫ్‌లో ప్రోప్లానెట్ పీపుల్‌గా గుర్తించడం జరుగుతోందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన, సైకిళ్లు, ఈ బైక్‌లు, ఈ కార్లు వంటి స్థిరమైన రవాణా మార్గాల గురించి పరిజ్ఞానం, నీటి వృథాను నియంత్రించడం, పర్యావరణ సంబంధిత లేబుళ్ల గురించి జ్ఞానం, అవగాహన పెంపొందించుకోవాల్సిన అంశాన్ని వివరించారు. ఒక చర్యను 21 రోజులపాటు నిరంతరం సాధన చేయడం వల్ల అలవాటు మార్చుకోవడానికి దోహదపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ 21 రోజులపాటు తమ జీవనశైలిని మార్చుకుంటూ ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కమిషనర్‌తో పాటు నగరపాలక సంస్థ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, కార్పొరేటర్లు, డీఈ, ఇంజినీరింగ్, శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 17న బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్

- బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి విడదల రజని



ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజని

ఒంగోలు:

ప్రతి ఏటా బ్రిలియంట్ కంప్యూటర్స్ సంస్థ నిర్వహించే ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2023 జూన్ 17న జరుగుతుందని బ్రిలియంట్ కంప్యూటర్స్ సంస్థ అధినేత డాక్టర్ షేక్ న్యామత్ తెలిపారు. సంబంధిత బ్రోచర్‌ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి విడదల రజనీ చేతుల మీదుగా చిలకలూరిపేటలోని మంత్రి కార్యాలయం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యామత్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా విద్యార్థుల కోసం ప్రతి ఏటా మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు.

ఈ ఏడాది కూడా ఒంగోలులోని ఏ1 ఫంక్షన్ హాలులో జూన్ 17న ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మంత్రి విడదల రజని, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ డీజీపీ కేఆర్ఎం కిషోర్‌కుమార్, జాతీయ స్థాయిలో పలు యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, పేరెన్నికగన్న యూనివర్సిటీల ప్రతినిధులు, ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు హాజరవుతారని తెలిపారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి భవిష్యత్ విద్యాభ్యాసానికి సంబంధించి అవగాహన పొందాలని కోరారు. ఎంట్రీపాస్‌ల కోసం 8179099699 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

1,077 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం -2లో బుధవారం వేలానికి 1,117 బేళ్లు రాగా, 1,077 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వాటిలో ఒకటి నోబిడ్ అయింది. కేజీ గరిష్ట ధర రూ.201 పలకగా, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.199.62గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

28న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

ఒంగోలు అర్బన్: స్థానిక అంజయ్య రోడ్డులోని ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఈ నెల 28న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సెంటర్ మేనేజర్ ఎస్.యామిని ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. సంతానలేమి స్పెషలిస్ట్ డాక్టర్ దీపిక బొప్పనతో ఉచిత కన్సల్టేషన్, ఉచిత స్కాన్, ఉచిత ఐయూఐ చేయడం జరుగుతుందన్నారు. సంతాన సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగరానికి చేరుకున్న మేయర్ గంగాడ సుజాత



మేయర్ సుజాతను కలిసి మొక్క అందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు: వ్యక్తిగత పర్యటనపై అమెరికా వెళ్లిన నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం తిరిగి ఒంగోలు నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, నాయకులు కలుసుకుని స్వాగతించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని మార్రెళ్లలో సీతారాముల కళ్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాలయ 2వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల నుంచి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో స్వామి కళ్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా సాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ఒంగోలులో మండుటెండలో రిక్షా తొక్కుకుంటూ తల్లి, తమ్ముడిని తీసుకెళ్తున్న బాలిక



కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామం వద్ద ఎండ తీవ్రతను తట్టుకోలేక పొలంలోని స్ప్రింక్లర్ల నీటిని మొహాలకు చల్లుకుంటున్న మహిళా కూలీలు

జీవన పోరాటం.!

ఒకవైపు మండుతున్న ఎండలు. మరోవైపు ఆకలి మంటలు. రెండింటితోనూ చేయాల్సిందే యుద్ధం. ఎండయినా.. వానయినా.. వరదయినా.. చలి పులయినా... బతుకుబండి లాగక తప్పని నిరుపేదల జీవన పోరాటం.

- సాక్షి, ఒంగోలు

కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట

- కనులపండువగా రఘునందనుని శాంతి కల్యాణం



గ్రామోత్సవంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులు

పామూరు: మండలంలోని సుబ్బక్కపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం అర్చకుల వేదమంత్రాల నడుమ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా రుత్వికులు మూలమంత్రం, చండీహోమం, మహాగణపతి హోమం, లక్ష్మీ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ, హనుమంతుని మూల విగ్రహ మూర్తులకు పంచామృతాభిషేకం ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలతో ప్రతిష్ట చేసి తదుపరి ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. ప్రతిష్టా మహోత్సవం తరువాత స్వామి పంచలోహ ఉత్సవ మూర్తులకు విశిష్ట పూజలు చేసి మంగళ వాయిద్యాల నడుమ వేడుకగా స్వామివార్లకు ఎదురుకోల నిర్వహించి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తీసుకువచ్చి కనులపండువగా శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రతిష్ట సందర్భంగా భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పోకా నాయుడు, చెంచురామయ్య, రమణయ్య, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



ధ్వజస్తంభ ప్రతిష్ట